


కొడవటిగంటి కుటుంబరావు

సామాన్యమానవమాత్రులు కనుక్కో-లేకుండా తన్నుకుంటున్న ఆ దాంపత్యరహస్యం భార్యాభర్తలు అభిప్రాయభేదాలతోనూ, అభిరుచిభేదాలతోనూ కిందుమీదవుతూండకుండా శాంతంగా కాపరం చెయ్యటం కనుక్కున్నట్టే కనపడ్డారు శాంతమ్మా, సత్యనారాయణా. వాళ్లకి సంబంధించినంతవరకూ ఆకాశం ఆచ్ఛాదన ఎరక్కుండా సూర్యచంద్రకాంతుల్లో కిలకిలా నవ్వుతున్నది. మధ్యమధ్య తెల్లని దూదిపింజలవంటి, సముద్రపునురుగంటి మబ్బుతునకలు లేవనికాదు. కాని ఆ మబ్బుతునకలనెవడైనా మేఘాలంటాడా-మాట లుపయోగించటం చాతకానివాడుతప్ప?

ఈ శాంతికి కారణం ఎవరంటే భార్యాభర్తలిద్దర్నీ చెప్పాలి. కాని, ఆ మబ్బుతునకలు? అవి కేవలము శాంతమ్మ పనితనమే. కాని ఆమబ్బుతునకలు చూస్తే సత్యనారాయణకు భయం లేదు. అవి చూడటానికెంత అందంగా ఉండటమేకాక, వాటిప్రవర్తనకూడా చాలా అనపాయకరంగా ఉంటుంది. ఇప్పుడక్కడ ఉన్నట్టే ఉంటై, మరుక్షణం ఎక్కడికో వెళ్లిపోతై, మరి కనిపించవు; అట్లా సూర్యుడికడ్డంవచ్చినట్టే ఉంటై. కాని, ఎండ ఏమాత్రమూ తగ్గదు. భూమిమీద వాటితాలూకు నీడే పడదు. పాపం! కాలక్రమాన సత్యనారాయణ అవి అక్కడ కనపడుతూంటేనేకాని జీవితాని కానందం లేదనే నమ్మకానికి వచ్చాడు.

అదీకాక శాంత అల్లరి చేస్తుంటే తొణక్కుండా నవ్వుతూ సహించటంలో సత్యనారాయణకు కొంత మాధుర్యం కనపడ్డది-చిట్టిపిల్లల బుల్లిచేతులతో కొట్టించుకుని ఓర్చుకోగలిగినట్టు!......

ధర్మమూ, సత్యమూ, న్యాయమూ మొదలైన మంచిగుణాలతోపాటు నిష్కళంకమైన దాంపత్యానురాగం చాలా ప్రియమైన వస్తువు. ఆసత్యం ధనాభావంతో బాధపడుతున్నవాడికి తెలియాలి! ఒకచెంప డొక్కలో మాడుతూ, రాత్రిభోజనం ఎక్కణ్ణుంచి వస్తుందో తెలేక బాధపడుతున్న దంపతులను అన్యోన్యానురాగాన్ని గురించి ఆలోచించమనండి!...... సత్యనారాయణకు ఆర్జనసమస్య లేదు.

సమయంకానిసమయంలో పుట్టుకొచ్చే పిల్లలు దంపతుల అన్యోన్యం చెడగొడుతారు. ఇక్కడ అటువంటిదికూడా జరగలేదు.

వారిద్దరిలో ఏ ఒకరికీ రొండోవారు ఎక్కువ అసహ్యించుకునే లోటుబాట్లు లేవు. (అంతా బాగుండి ఏ నత్తి ఒకటున్నా సరిపాయె రసాభాసానికి!)

అన్నిటికన్నా ముఖ్యమైన విషయం— ఒకరినొకరు పురుగేరుదామని కాని, చులకనగా చూద్దామని కాని, ఇద్దరూ ప్రయత్నం చెయ్యలేదు. సామాన్యంగా భార్యాభర్తల మధ్య అశాంతి ఒకరినొకరు-ఎంత స్వల్పంగానైనా కానివ్వండి—నీచంగా చూసుకోవటంతో మొదలుపెడుతుంది. మొగుడు పెళ్లాన్ని ఎంతో గౌరవంగానో చూడటంయొక్క ఆవశ్యకత ఏ ముప్ఫయ్యో యేటో కనుక్కున్నవాడికన్న దురదృష్టవంతుడుండబోడు. మొగుణ్ణి "మీరు" అని సంబోధించటం యొక్క అంతరార్థం కనుక్కోలేని ఆడదీ అంతే......

బుద్ధివంతుడు కనక సత్యనారాయణ పెళ్లాన్ని ప్రశ్నలు వేసేవాడుకాడు. పొరపాటున శాంతమ్మ తన్ను ప్రశ్నిస్తే అతను ముక్కుమీద వేలుపెట్టుకునేవాడు. మొగుడాపని చేసినప్పుడు శాంతమ్మ మారుమాట్లాడకుండా తప్పు మౌనంగా సవరించుకుంటూ వచ్చింది. కాని, శాంతమ్మలో నూరుగురిలో తొంభై తొమ్మిదిమంది ఆడవాళ్లకు లేని జ్ఞానేంద్రియం ఒకటి ఉంది. తద్ద్వారా తన మౌనం మొగుడికి కించిత్తు పశ్చాత్తాపం కలిగిస్తున్నదని శాంతమ్మ త్వరలోనే కనుక్కుంది. శాంతమ్మ తనవిషయంలో గురుభావం గాని, ఉత్త పోడిగౌరవంగాని చూపిస్తే అతను కంగారుపడేవాడు. అందుకని మొగుడు ముక్కుమీద వేలు పెట్టినప్పుడు శాంతమ్మ మూతి ముడుచుకుని తగుమాత్రం అల్లరి చేసేది—కాని తన పంతం నెగ్గించుకుందామని ఒక్కపిసరయినా ప్రయత్నం చేసేది కాదు. ఒకవేళ సత్యనారాయణ "పోనీ, చెప్పనా?" అంటే, "నాకేం అఖ్కర్లేదు లెండి!" అనేది. ఇంకా అతను వినకపోతే చెవుల్లో వేళ్లు పెట్టుకొని "ఏమిటండీ నాకఖ్కర్లేదంటేనూ! చెబితే నన్ను చంపుకున్నట్టే!" బస్! మరో మబ్బుతునక, దూది అట్లాకనపడ్డట్టు కనపడి, అతని మనస్సుకు ఉల్లాసం కలిగించి మరుక్షణం ఎక్కడికో వెళ్లిపోయేది!......శాంతమ్మను ఎంతో బలవంతాన సత్యనారాయణ ముద్దుపెట్టుకోగలిగేవాడు అటువంటప్పుడు

ఇంతకూ సత్యనారాయణకు భార్యకు తెలేకుండా అవశ్యంగా దాచవలసిన రహస్యం ఒకటి ఉంది! అతనికి సంపాదించవలసిన ఆవశ్యకత లేదన్నాను. కాని, వ్యాపకం ఒకటి ఉండవలసిన అగత్యం లేకపోలేదు. సుమారైన తెలివిగలవాడికి నిర్వ్యాపారత్వం కన్న నరకం లేదు. ఏదో పని చెయ్యాలి గదా అని అతను విధవావివాహసహాయార్థం పనిచేస్తున్న ఒకసంస్థకు తనశరీరమూ, యథాశక్తి ధనమూ వప్పజెప్పాడు.

ఈవిషయంభార్యకు తెలియరాదు. ఆవిడ పల్లెటూరిపిల్ల. ఆవిడముత్తాత యజ్ఞమే చేశా

డు. ఆవిడ కిప్పుడీ విధవావివాహాలయొక్క ఆవశ్యకత బోధించటం కష్టం. పెద్దపెద్ద వాళ్లనే చూడటంలేదూ? వాళ్లు తర్కానికి లొంగరు. వేదాలూ, శాస్త్రాలూకూడా వాళ్ల కక్కర్లేదు.—కావలిస్తే ప్రతి స్వల్ప విషయం లోనూ వాటిని అధిగమించి చరిస్తారా? ఏతావతా ఇది అభిరుచికి సంబంధించిన విషయమని ఒప్పుకోవలిసివస్తున్నది. విధవా వివాహాల నామోదించేవారే ఆచరించటం లేదు! చిన్నపిల్ల, శాంతమ్మ కిప్పు డర్థమవు తుందా? అసలు తెలేకుండా దాచటమే వివేకం. ఒకసారి భార్య తన్ను రాక్షసాంశ సంభూతు డన్నట్టు చూస్తే క్రమంగా దాంప త్యం ఏ అధోగతికిపోతుందో అతనికి ఊహిం చటం దుర్భరమైంది!

"ఇవాళ మీరు క్లబ్బుకు వెళ్లలేదుటే. పినమామగా రన్నారు. ఎక్కడికి వెళ్లా రండీ?" "పొద్దున మీతో వచ్చిన కోతి మొహమాయన ఎవరండీ?" (కోతిమొహ మాయన బసవేశ్వరరావుగారు. పాతిక వివా హాలకు పీటలమీద కూర్చున్నవాడు!) అని మధ్యమధ్య శాంతమ్మ ప్రశ్నించినా అతను చెప్పకపోతే కనుక్కోవాలని ప్రయత్నం చేసేదికాదు.

కాని అదేం కర్మమో రహస్యంగా ఉంచాలని ప్రయత్నం చేస్తేనే రహస్యాలు బయటపడేది. ప్రయత్నం చేసిన పాపానికి ఫలమేమిటంటే, అవి బయటపడేటప్పుడు "కంప్రెస్" చేసిన గాలి బయటపడేటప్పుడయినంత గోల జరుగుతుంది, రహస్యం బయటపడటానికి.

ఒకరోజు సాయంతరం మామూలు వేళకే సత్యనారాయణ ఇంటి కొచ్చి ఇంకా వంట కాకపోవటాని కాశ్చర్యపడ్డాడు. వం టింటో చెంబుతప్పాలాలు మామూలుకు రెట్టింపు చప్పుడు చెయ్యటంకూడా చాలా అనుమానాస్పదంగా ఉంది. కాని, సత్యనారా యణ "కట్టెలు మండటంలేదు కామాలు, పిల్ల కాగ్రహం వచ్చింది!" అనుకుని ఊరు కున్నాడు.

ఒక అరగంట అవతల భోజనం చేస్తూ అతను "కట్టెలు పచ్చివి పంపాడా యేం? అన్నాడు.


"పచ్చివేం? క్షయరోగంతో చచ్చిన వాడల్లే దివ్యంగా వెలుగుతునై!"

సత్యనారాయణ ప్రశ్నార్థంగా తల ఎత్తి చూడక తప్పలేదు. ఇంతవరకూ విపరీతం ఏమీలేదు. కాని తరవాతే విచిత్రమైనసంగతి జరిగింది. శాంతమ్మ మొహాన కోపం దాచిపెట్టి నవ్వింది. అదివరకూ కల్లా లేనికోపం ప్రకటించ టమే కాని ఉన్నది దాచటంలేదు. స్పష్టంగా ఆనవ్వుతో తన్ను మాయ చెయ్యాలనికూడా చూస్తున్నది. ఇదితప్పకుండా మేఘమే. దీన్ని చూసి ఆనందించటం అతనికి తెలేదు.

మామూలుగానే గాని అసంతృప్తిగా భోంచేసి అతను పరధ్యానంగా వెళ్లి పడుకు న్నాడు. నిద్రపోకపూర్వం ఒక గంటసేపు

చదవటం అతని కలవాటు. ఏమీ జరగ నట్టే చదవటం మొదలుపెట్టాడు కాని అతని మెదడు సాంతంగా దానిమీద లేదు.

శాంతమ్మ భోంచేసి, పనులన్నీ చూసుకుని పడుకోటానికి వచ్చేటప్పటికి పుస్తకంలో మునిగిఉన్న ట్టున్నాడు మొగుడు. తప్పుచేసిన ఆమెబుద్ధికి అతని ప్రవర్తనలో గుప్తంగా ఉన్న క్రోధం కనపడ్డది. అతని వంక—మొహాని కడ్డంగా ఉన్న పుస్తకం వంక—రొండునిమిషాలపాటు చూస్తూ నిలుచుంది. అప్పు డతను మొహానికి పుస్తకం అడ్డంతీసి తనవంక చూసినాచాలు. అమాంతం అతని చేతుల్లోకి ఉరికేదే. కాని అత నట్లా చెయ్యలేదు, ఆమె వచ్చినసంగతి అతనికి తెలేదా? తెలిసి ఎందు కంత బెట్టుసరి? అతను తనవంకేచూస్తే!—ఆకళ్లజోడు పెట్టుకొచ్చిన బడితెనుకూడా ఆమె లెఖ్కచెయ్య దలచలేదు!



"అతనివంక—రొండునిమిషాలపాటు చూస్తూ నిలుచుంది."

రొండునిమిషాలయింది. అతను కదల్లేదు. శాంతమ్మ మెల్లిగా రొండో మంచంమీద పక్క వేసుకుని అటుతిరిగి పడుకుంది.

అయిదు నిమిషాలవతల సత్యనారాయణమంచం చప్పుడయింది. తరవాత చిన్నగొంతుతో— "శాంతా!"

సమాధానం చెప్ప దలచుకున్నా శాంతమ్మకు చాతకాలేదు. ఆమెకు దుఃఖం పొంగివచ్చింది.

ఆపిలుపులో ఆశ్చర్యం! తను రొండు నిమిషా లతనికోసం నిలబడిఉంటే తన్ను అతను గమనించకుండా ఉండనట్టే! "ఏమిటే, అవతల వెళ్లి పడుకున్నావూ!!!" అన్నంత ఆశ్చర్యం! "శాంతా!"

పెళ్లాం ఏడుస్తున్న సంగతి సత్యనారాయణ గ్రహించాడు. లేచి వెళ్లి శాంతమ్మ భుజంమీద చెయ్యివేసి బలవంతాన వెల్లికిలా తిప్పాడు.

"ఎందుకు పిల్లా, ఏడుస్తున్నావు?"

"మీకు నామీద ఎందుకోపం వచ్చింది?"

"నీ కెవరిమీదా, కోపం వచ్చింది?"

"నా కోపం వచ్చిందని మీ కెట్లా తెలిసింది?"

"నాకు తెలేదని నువ్వెందు కనుకున్నావు?"

"నా కేముంది కోప్పడటానికి?"

"మరెందు కంత అల్లరిపిల్లల్లే ప్రవర్తిస్తున్నావు?"

ఒకర్నొకరు చాలారోజులకు సరిపోయ్యే ప్రశ్నలు వేసుకున్నారు. శాంతమ్మ అతని చివరప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

"ఏం జరిగింది, చెప్పవూ?" అన్నాడు సత్యనారాయణ మెల్లిగా పెళ్లాన్ని చేతుల్లోకి తీసుకుని, ఆమెబుగ్గమీద తనచెంప ఆనించి.

ఇంత అయినతరవాత శాంతమ్మ "ఆ కళ్లజోడు పెటుకున్న బడితె"ను మరిచిపోగలిగింది. ఆమెఉక్రోషం అంతా దిగిపోయింది.

"ఇహ చెయ్యను లెండి!" అంది.

"అదా సమాధానం? ఏం జరిగిందో చెప్పెయ్యి! ఇంతదూరం వచ్చినవిషయాన్ని వదిలెయ్యటం మంచిది కాదు. నువ్వు దిగమింగలేని ఉండ ఏదో గొంతు కడ్డంపడ్డది. దిగమింగగలిగితే ఇంతదూరం రాదు. ఏమిటది? బయటికి లాగేస్తాను. చెప్పు! లేకపోతే దానివల్ల ఇద్దరికీ బాధ ఉంది."

"మింగేశాను లెండి!" అంది శాంతమ్మ కన్నీటిలోనుంచి కొద్దిగా నవ్వుతూ.

"అనుకుంటున్నా వంతే!"

శాంతమ్మ మాట్లాడలేదు.

"ఏమయింది?"

"ఏమీ కాలేదు! మీ రున్నారా అంటూ ఒకబడితె వచ్చింది, కళ్లజోడు పెట్టుకుని. మీపేరుచెప్పి "ఉన్నారండీ?" అని ఒయ్యారంగా—దానివొయ్యారంవల్లకా—"

"పేరు?"

"ఏమో? మీకు తెలేకుండా ఉండాయేమిటి? అనుకున్నాను." చివర ఆముక్క తగిలించటం భావ్యంగా ఉంటుం దని భావించింది శాంతమ్మ. తనలోపల ఇంకా అసూయ రగులుచున్న దని అతని కెందుకు తెలియచెయ్యటం? ఆమనిషి జ్ఞాపకం వస్తే ఆమెకు మండిపోతున్నది. ఆయనదే తప్పు ఎందుకు మరచినదాన్ని తవ్వటం?

"ఎట్లా ఉంటుంది?"

"బడి—సన్నగా, పొడుగ్గా!"

"ఎవరో?...ఆఁ! వస్తే?"

"లేరన్నాను."

"అంటే?"

"వెళ్లిపోయింది."

"ఇంతేనా?"

"ఇంతే!"

"ఇంతమాత్రానికే ఏడుస్తున్నావా?"

"ఎంతమాత్ర మేమిటి? మీ కావిడతో ఏం పని?"

"నాకేమీ పని లేదు."

"అయితే ఎందుకొచ్చిందీ?"

"బహుశా నాతో పనుండి వచ్చిఉంటుంది!"

"అదే, నేనన్నది! ఏంపని?"

"నేను వెధవపిల్లలు పెళ్లాడటానికి ధనసహాయం చేస్తుంటాను. నీ కది యిష్టంగా ఉండదని నీతో ఎన్నడూ అనలేదు. ఆపిల్లెవరో ఆపనిమీదనే వచ్చిఉంటుంది! ఈ భాగ్యాని కింత రాద్ధాంతంచేశావు! బాగుంది!"

శాంతమ్మ మాట్లాడకుండా తన మొహం అతనిచెంపకేసి రుద్దటం మొదలుపెట్టింది. ఆమె ఆలోచనకూడా మానేసింది. మొగుణ్ణి అనుమానించటం మనసు కెంతబాధో ఆమెకు తెలిసొచ్చింది.

ఇదయిన తరువాత సత్యనారాయణ సరిగా మగవాడుల్లే-ఆడదాని మనసు తెలేని వాడల్లే -ప్రవర్తించాడు. తను ఏమీ జరుగనట్టు భావించటానికి సంసిద్ధుడై, శాంతమ్మ కూడా అట్లాగే భావించిందనుకున్నాడు. కాని ఆమేఘం దృక్పథంలోనేఉంది—అతను చూడగలిగితే.

మొగుడిమాటలు శాంతమ్మ పూర్తిగా నమ్మలేదు.

చిన్నతనంలో మొగుళ్లుపోయినవాళ్లకు పెళ్లి చెయ్యటానికి రహస్యం ఎందుకు? మంచిపనేగా! మాసపత్రికల్లోనూ, వాటిల్లోనూ కథలు పడటం లా? ఇంకా ఏదో ఉంది. తప్పకుండా. లేకపోతే తన మొగుడు దాచడు. వయసుపిల్లలు వీళ్ల చేతుల్లో చిక్కితే వాళ్లనేమీ చెయ్యకుండా, వీళ్లు సహాయం చేసి ఇంకోడి చేతులో పెడతారా అని పక్కింటి రుక్మిణమ్మ అందికూడాను. రొండో పెళ్లికి ఒప్పకునేవాళ్లిటువంటివాటికి మాత్రం ఒప్పకోరా? ఈబడితె చూడరాదూ? వయసులో ఉన్న మగవాళ్లను పాడుచెయ్యటానికే సరయిన మనిషి! ఏముందీ? స్వేచ్ఛగా మాట్లాడుతుంది! చేతులు కలుపుతుంది! ఫాషన్—దొరల ఫాషన్! ముద్దు పెట్టుకోనిస్తుందేమో కూడా! పొయ్యే దేముందీ — సిగ్గనేది పోయిన తరవాత!

విద్యాగంధమూ, ప్రపంచజ్ఞానమూ లేని లోపంతోపాటు, శాంతమ్మకు తనకన్న ఈ పిల్ల నిజంగా ఎక్కువఅందగత్తె అన్న నమ్మకంకూడా బాధించటం మొదలుపెట్టింది. ఆడవాళ్లకు మగవాడి అభిరుచి తెలేనిలోపం!

కాని కడుపులో ఉన్న విషం కక్కటానికి అవకాశం లేకుండా చేశాడు మొగుడు. తన్ను మంచిమాటలతో మోసపుచ్చాడని ఆమెకు గట్టి నమ్మకంకూడా కలిగింది! ఇక ఏం చెయ్యాలి?

వారం రోజులకు మంచిఅవకాశం దొరికింది. కొల్లూరునించి జానకి చూడవచ్చింది.

“ఎప్పుడొచ్చావే, జానకీ! రావే! కూర్చోవే! ఎన్నాళ్లయిందే నిన్ను చూసి!”

జానకికి చిన్నతనంలో మొగుడు పోయినాడు. ఆమె తిరిగి పెళ్లి చేసుకోవటంవిషయం సత్యనారాయణను సలహా అడగవచ్చింది.

అయితే తనభర్త ఈ వివాహాలు చేయిస్తున్నమాట నిజమే! మంచిపనే! పాపం, జానకిని చూడరాదూ! ఎంత చక్కనిపిల్ల, మెరుపుతీగంటిది! ఏమిటి, పెళ్లీ పెటాకులూ లేకుండా!......

అప్పుడు పుట్టింది దుర్బుద్ధి శాంతమ్మకు, మొగుణ్ణి పరీక్ష చెయ్యాలని. ఒకచెంప జానకితో మాట్లాడుతూనే వ్యూహం ఆలోచించింది. దానియొక్క పర్యవసానం గురించి ఆలోచించటం ఆడలక్షణం గాదు. అది భగవంతుడినెత్తినే వదిలేసింది.

ఒక గంట కూచుని జానకి “మళ్లీ వస్తా లేవే!” అని లేవబోయింది.

“వస్తారు కూచోవే!” అని శాంతమ్మ స్నేహితురాలిని మరో రొండు గంటలు కూచోబెట్టింది.

సత్యనారాయణ లోపలికొస్తూనే మరో ఆడదాన్ని చూసి తనగదివైపు మళ్లాడు. “ఏమండోయి, మాట!” అంది భార్య. సత్యనారాయణ అనుమానిస్తూ వచ్చాడు. శాంతమ్మ భర్తకు జానకిని ఎరుగజేసింది. తరవాత సంగతంతా చెప్పింది.

“మంచివరుడికోసరం ప్రయత్నంచేస్తా” నన్నాడు సత్యనారాయణ. జానకి మాట్లాడటానికి నోరువిప్పి, మళ్లీ ఊరుకుంది. తరవాత శాంతమ్మ అప్పటికే ఆలస్యమైన వంటకోసం లేచింది. జానికి శలవు పుచ్చుకుంది.

శాంతమ్మ మొగుణ్ణి వంటింటో తనకు తోడు కూచోబెట్టుకుని వంట ప్రారంభించింది.

పొయిలో కిరసనాయిలుపోసి అంటించి కట్టెలుపెడుతూ శాంతమ్మ “మన మామూలు పెళ్లిళ్లకన్న ఈ విధవావివాహాలు బాగుంటయి కాదుటండీ!” అంది. కిరసనాయిలు మంటల వెలుతురు ఆమె మొహాన ఆడుతున్నది.

“ఒకకారణంవల్ల మన పెళ్లిళ్లకన్న అసహ్యంగా పరిణమిస్తై” అన్నాడు సత్యనారాయణ.

“ఏం?”

“కావలిసిన మొగుడు దొరక్క!”

“ఆఁ! ఆదేమిటండీ? కావలిసిన మొగుళ్లు వాళ్లకే దొరుకుతా రనుకున్నానే!”

“ఏబ్బే! వచ్చేవాడికి ఈ వివాహం ఇష్టమైఉండాలి. ఎక్కడా పెళ్లికాని నాగమ్మ

కాకుండా ఉండాలి. అన్నివిధాలా పిల్లకు తగి ఉండాలి. పిల్ల కేమైన ఆస్తిపాస్తులుంటే వాటిని చూసిరాగూడదు. పిల్లకు వాణ్ణి చూస్తే యిష్టంగా ఉండాలి!—దాదాపూ అసంభవం! మామూలు పిల్లకు వందమంది మగవాళ్లలో నించి ఏరుకోటానికి వీలుంటే, వితంతువుకు అయిదుగురు కూడా ఉండరు. వితంతువులు అన్ని తరగతుల్లోనించీ వస్తారు. వాళ్లను పెళ్లాడేందుకు ఎక్కువగా వివాహానర్హులు తయారౌతారు. కాని ఈపరిస్థితు లిట్లాగే ఉండవులే! మొదట్లో ఈ యిబ్బందులు తప్పవుమరి!"

"అందరిసంగతీ మన కెందుకు లేండి గాని, ఎవత్తయినా ఒకడి మీద అపేక్ష కలిగి వాడే కావాలంటుందనుకోండి. వాడి కావెధవ పిల్ల నిచ్చి చెయ్యటం మీచేతులో వుందనుకోండి— మాట వరసకు! చేస్తారా?"

"నాచేతులో వుంటే చెయ్యకేం?"

"అయితే చేతులో చెయ్యివెయ్యండి!"

సత్యనారాయణ పెళ్లాంగొంతులో ఉద్రేకానికి ఆశ్చర్యపడ్డాడు.

"ఎందుకు?" అన్నాడు.

"పాపం, మాజానక్కి మంచి మొగుణ్ణి చెయ్యరూ?"

"తప్పకుండా! ఎవరది?"

"మీరే!"



"మన మామూలు పెళ్లిళ్లకన్న ఈ విధవావివాహాలు

"నేనా!" సత్యనారాయణ నిర్ఘాంత పోయినాడు.

"ఏం అయితే?"

"నాకు పెళ్ళయిందిగా?"

"ఏమయితే? ఇద్దరు పెళ్ళాలకు ధర్మ శాస్త్రం ఒప్పదూ?"

"నాకు చాలా బాధ కలిగించే హాస్యం ఇది!"

"ఒట్టండీ! అది చెప్పేసింది!"

"నావల్ల కాదు!"


"ఇదేనా మీ దయాబుద్ధి? దాని సుఖం మీ చేతులో ఉంచేకూడా, మీవల్ల కాదంటారా? నాకేమీ అభ్యంతరం లేదు!"

అతని కంగా రామెకు చెప్ప రానంత తృప్తికరంగా ఉంది. ఒక్క-భార్యవల్లనే సుఖ పడేవాడికి తప్ప అంతకంగా రుండదు.

సత్యనారాయణ అకస్మాత్తుగా మౌనం లోపడి మరి మాట్లాడ లేదు. అతనికూ_డా తగినంత ప్రపంచజ్ఞానం లేకపోవటమూ, చిన్నతనమూ శాంతమ్మ యుక్తికి అనువయినై.

ఎట్లాగో భోంచేసి అతను "ఆపిల్ల ఎక్క_డుంటుంది?" అని అడిగాడు.

ఈ సారి కంగారుపడటం శాంతమ్మ వంతు! పోయి అడగదుగద!



"బాగుంటుంది కాదుటండీ!" అంది.


"ఎందుకు?"

ఆ మీగొంతులోనే అతనికి తెలిసిపోయింది. పెళ్లాం అబద్ధమాడిందని. వెంటనే తడువుకోకుండా "నేను ఒప్పుకున్నానని చెప్పివస్తాను. చక్కని పిల్లా! నీకేమీ అభ్యంతరం లేదూ! ముగ్గురమూ చక్కగా కాపరం చేద్దాం."

అన్నంపీస్తరిముందు కూచుని శాంతమ్మ వెక్కి వెక్కి యేడవటం మొదలుపెట్టింది. అతనికి జాలేసింది. ఈ చిన్నపిల్లతో తనూ పసివాడెందుకాకావాలి? ఆ ఓర్పుతో అత మనస్సులో కొంత ఆనందం ప్రవేశించింది.

"ఈసారికి పోనిలే, మరోమాటు నన్నెవరైనా చేసుకుంటానని వస్తే మానను సుమా!" అన్నాడు నవ్వుతూ.

---



నివ్వెర J. K.